పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 19(నమస్తే తెలంగాణ): పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వచ్చే నాలుగేండ్లలో దశలవారీగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యుటేషన్‌పై వివిధ శాఖల్లో పనిచేస్తున్న 326 మంది హౌసింగ్ శాఖ ఉద్యోగులను తిరిగి నియమించి హౌసింగ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేశామని తెలిపారు.

కొలంబియా ఘర్షణల్లో 80 మంది మృతి

బొగోటా: కొలంబియాలో జరుగుతున్న ఘర్షణల్లో సుమారు 80 మంది మరణించగా, 20 మంది గాయపడ్డారు. ప్రభుత్వం, జాతీయ విముక్తి సైన్యం (ఈఎల్ఎన్) మధ్య శాంతి చర్చలకు జరుగుతున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. నార్త్ శాంటాండెర్‌లో ఎక్కువ మంది మరణించినట్లు గవర్నర్ విలియం తెలిపారు. శాంతి ఒప్పందం కోసం ప్రయత్నించిన నేత కార్మెలో కూడా మరణించారు. శాంతి చర్చల కోసం ప్రయత్నించిన ముగ్గురిని కిడ్నాప్ చేశారని అధికారులు చెప్పారు. కొలంబియా ఈశాన్య ప్రాంతం నుంచి వేలాది మంది పారిపోతున్నారు. కొందరు సమీపంలోని కొండల్లో దాక్కుంటున్నారు. అన్ని రకాల దాడులను ఆపేయాలని ఈఎల్ఎన్‌ను కొలంబియా ప్రభుత్వం డిమాండ్ చేసింది.

గంగానదిలో పడవ మునక

ముగ్గురి మృతి.. ఐదుగురు గల్లంతు

కటిహార్, జనవరి 19: బీహార్‌లోని కటిహార్ జిల్లాలో ఆదివారం గంగా నదిలో ఓ పడవ మునిగిపోయి మూడేళ్ల చిన్నారితోసహా ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. 15 మంది ప్రయాణిస్తున్న పడవ అందాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ వద్ద గంగా నదిలో మునిగిందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఏడుగురిని రక్షించగా, కొందరు ఈదుకుంటూ ఒడ్డును చేరినట్టు వారు చెప్పారు. మృతులకు సంతాపం ప్రకటించిన సీఎం నితీశ్ కు మార్ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

పారాగ్లైడింగ్‌లో టూరిస్ట్, శిక్షకుడు దుర్మరణం

పనాజీ, జనవరి 19: ఉత్తర గోవాలో శనివారం జరిగిన పారాగ్లైడింగ్ ప్రమాదంలో ఓ పర్యాటకురాలు, ఓ శిక్షకుడు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం ఈ ఘటన శనివారం సాయంత్రం జరిగింది. పుణె నివాసి శివాని దబ్లే(27), నేపాలీ శిక్షకుడు సుమల్ నేపాలీతో కలిసి కెరి పీఠభూమి వద్ద పారాగ్లైడింగ్ చేస్తున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. ఓ కొండ పైనుంచి ఎగిరిన వెంటనే శివాని, సుమల్ పక్కనే ఉన్న లోయలో పడిపోయారు. చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న సాహస క్రీడల సంస్థతో శివాని పారాగ్లైడింగ్ చేశారు. సదరు సంస్థ యజమాని శేఖర్ రైజాదాపై పోలీసులు కేసు నమోదు చేశారు.

షకీబ్ అల్ హసన్‌పై అరెస్ట్ వారంట్

ఢాకా: క్రికెటర్ షకీబ్ అల్ హసన్‌పై బంగ్లాదేశ్ కోర్టు అరెస్ట్ వారంట్ జారీ చేసింది. దాదాపు రూ.2.6 కోట్ల విలువైన చెక్కులు బౌన్స్ అయిన కేసులో కోర్టు ఆయనకు గతంలో సమన్లు ఇచ్చింది. కానీ ఆయన కోర్టుకు హాజరుకాలేదు. దీంతో కోర్టు ఈ చర్య తీసుకుంది. ఈ కేసును ఐఎఫ్ఐసీ బ్యాంకు దాఖలు చేసింది.

బెంగళూరు టెకీకి 11 కోట్లు టోకరా

బెంగళూరు, జనవరి 19: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కస్టమ్స్ అధికారులమంటూ బెదిరించి సైబర్ కేటుగాళ్లు బెంగళూరులో ఓ టెకీ నుంచి రూ.11 కోట్లు కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులు తరుణ్ నటానీ, కరన్, ధావల్ షాలను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడు విజయ్‌కుమార్ వద్ద స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రూ.12 కోట్ల వరకు ఉన్నాయని నిందితులు తెలుసుకున్నారు. ఆ మొత్తాన్ని కాజేయడానికి కుట్ర పన్నారు. పోలీసులు, ఈడీ, కస్టమ్స్ అధికారులుగా నటిస్తూ, మనీ లాండరింగ్ కేసుపై అరెస్టు చేస్తామని బెదిరించారు. విజయ్‌కుమార్ వ్యక్తిగత వివరాలు, పాన్, ఆధార్, బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరించాక, అతడి బ్యాంక్ ఖాతాల నుంచి కొన్ని నెలల పాటు రూ.11 కోట్లను తమ బ్యాంక్ ఖాతాల్లోకి తరలించుకున్నారు. బాధితుడు ఫిర్యాదుతో, పోలీసులు రూ.7.5 కోట్ల తరలింపును పట్టుకోగలిగారు.

హైదరాబాద్‌లో అత్యాధునిక ఐటీ పార్క్

- **10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి**
- **రూ.450 కోట్లతో ఏర్పాటు చేయనున్న క్యాపిటల్యాండ్**

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు 'క్యాపిటల్యాండ్' కంపెనీ ముందుకొచ్చింది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సింగపూర్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించిన 'క్యాపిటల్యాండ్'.. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సింగపూర్‌కు చెందిన ఈ కంపెనీ ప్రపంచ స్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటిగా పేరుగాంచింది. 'క్యాపిటల్యాండ్' నిర్ణయాన్ని సీఎం స్వాగతించారు. ఆ కంపెనీ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించటం ఆనందంగా ఉన్నదని 'క్యాపిటల్యాండ్' ఇండియా సీఈవో గౌరీశంకర్ నాగభూషణం పేర్కొన్నారు. బ్లూచిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలతోపాటు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఈ ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, క్యాపిటల్యాండ్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'క్యాపిటల్యాండ్' ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్)తోపాటు అవాన్స్ హైదరాబాద్, సైబర్ పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డాటా సెంటర్ ఈ ఏడాదిలోనే అందుబాటులోకి రానున్నది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి ఏర్పాటు కానున్నది.

ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం 3 రోజుల సింగపూర్ పర్యటన ఆదివారంతో ముగిసింది. సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ బాబు, అధికారుల బృందం దావోస్‌కు బయల్దేరి వెళ్లింది. సోమవారం నుంచి అక్కడ 4 రోజులపాటు జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో వారు పాల్గొంటారు. సదస్సుపై రాష్ట్ర బృందం భారీ అంచనాలు పెట్టుకున్నది. చివరిరోజు సింగపూర్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బృందం అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో ముఖాముఖి చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సీఈవో ప్రదీప్త్ బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్‌హిమ్‌న్‌తో చర్చలు జరిపింది. పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వ విధానాలు వివరించింది.

కేసీఆర్ హయాంలోనే

'క్యాపిటల్యాండ్' విస్తరణ

2022లోనే రూ.6,200 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): సింగపూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ 'క్యాపిటల్యాండ్' హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టడం కొత్తేమీ కాదు. 2011 నుంచే హైదరాబాద్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ సంస్థ గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలను దృష్టిలో పెట్టుకుని ఇదివరకే భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించింది. 2022 డిసెంబర్‌లో రూ.6,200 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. అందులో భాగంగా మాదాపూర్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్కులో రూ.1,200 కోట్లతో అత్యాధునిక డాటా సెంటర్‌ను నెలకొల్పడంతోపాటు హైదరాబాద్‌లో 60 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఆఫీస్ స్పేస్‌ను రూ.5 వేల కోట్లతో రెట్టింపు చేయనున్నట్టు వెల్లడించింది. మాదాపూర్‌లో ఏర్పాటు చేసే డాటా సెంటర్ 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 36 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యంతో ఉంటుందని, భారత్‌లో నవీ ముంబై తర్వాత తాము ఏర్పాటు చేస్తున్న రెండో డాటా సెంటర్ ఇదేనని, వచ్చే ఐదేండ్లలో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని 'క్యాపిటల్యాండ్' సీఈవో సంజీవ్‌దాస్ గుప్తా ఆనాడే ప్రకటించారు. వాస్తవానికి ఈ సంస్థ గత 30 ఏండ్ల నుంచి మన దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నది. భారత్‌లోని 6 నగరాల్లో 12 బిజినెస్ పార్కులను నెలకొల్పిన 'క్యాపిటల్యాండ్'.. వాటిలో మూడింటిని హైదరాబాద్‌లోనే ఏర్పాటు చేసింది. 90 శాతం ఆక్యుపెన్సీ ఉన్న ఈ వ్యాపార కేంద్రాల్లో వివిధ బహుళజాతి కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వాటిలో దాదాపు 1.50 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

2023లోనే ఐటీపీహెచ్ ప్రారంభం

నవీ ముంబైలోని గ్రీన్‌ఫీల్డ్ డాటా సెంటర్ డెవలప్‌మెంట్ సైట్‌ను 2021లో కొనుగోలు చేయడం ద్వారా భారత మార్కెట్‌లోకి ప్రవేశించిన 'క్యాపిటల్యాండ్' హైదరాబాద్‌లో 14 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ టెక్‌పార్క్ (ఐటీపీహెచ్)ను ఏర్పాటు చేసింది. దీన్ని 2023 సెప్టెంబర్‌లో నాటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

హైదరాబాద్‌లో 'క్యాపిటల్యాండ్' కార్యకలాపాలు

- హైటెక్‌సిటీ ఎస్ఈజెడ్‌లో 'అవన్స్' పేరుతో 15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం సమకూర్చుకున్న ది.
- అవన్స్, సైబర్ పెరల్, ఇంటర్నేషనల్ టెక్‌పార్క్ తదితర బిజినెస్ పార్క్‌లను అభివృద్ధి చేసింది.
- ఐటీపీహెచ్‌లో రూ.1,200 కోట్లతో డాటా సెంటర్‌ను నిర్మిస్తున్నది.
- హైదరాబాద్‌లో కొనసాగుతున్న వ్యాపార కేంద్రాల విస్తీర్ణాన్ని రూ.5 వేల కోట్లతో రెట్టింపు చేస్తున్నది.
- హైటెక్‌సిటీలో పలు వాణిజ్య భవనాల కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకున్న 'క్యాపిటల్యాండ్' రూ.450 కోట్లతో అత్యాధునిక డాటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది.

వలస నేతలకే పట్టం!

- **అసలు కాంగ్రెస్ నేతలకు హ్యాండ్**
- **పార్టీని నమ్ముకున్నోళ్లకు సున్నా**
- **వలస నేతలకే పదవులు ఖాయం**
- **చేరగానే జితేందర్‌రెడ్డికి పదవి**
- **చైర్‌పర్సన్‌గా సీతాదయాకర్?**
- **ఏఐసీసీకి పాత కాంగ్రెస్ నేతల ఫిర్యాదులు**

హైదరాబాద్, జనవరి19(నమస్తే తెలంగాణ): గాంధీ కుటుంబాన్నే నమ్ముకొని కాంగ్రెస్ జెండాను మోసిన అసలైన నేతలను పక్కకు నెట్టి, జెండాలు మార్చిన వలస నేతలు రాత్రికి రాత్రే నామినేటెడ్ పోస్టులను ఎగురేసుకుపోతున్నారని ఆ పార్టీ నేతలు ఆందోళనలో ఉన్నారు. బీజేపీ నుంచి వచ్చిన ఏపీ జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి గెలిచి గోడ దూకిన అరెకపూడి గాంధీ, గుత్తా అమిత్‌రెడ్డికి వెంటనే పదవులు దక్కాయి. టీడీపీ నుంచి వలస వచ్చిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డికి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేయడంపై పాత కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేసిన వారికి, అసెంబ్లీ టికెట్లు త్యాగం చేసిన నేతలకు తొలి ప్రాధాన్యంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తామని ఏఐసీసీతోపాటు కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయ కమిటీ ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక వలస వాదుల పెత్తనం పెరిగి తమను కరివేపాకును తీసినట్టు తీసివేస్తున్నారనే కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ కాంగ్రెస్ నేత ఆవేదన వ్యక్తంచేశారు.

స్పీకర్‌కు ఫిర్యాదు

మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మరో వలస నేత, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డికి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టాలని చూస్తున్నారని, దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉంటున్నా తమను పట్టించుకోవడమే లేదని కాంగ్రెస్ నేతలు వాపోతున్నారు. బాలల హక్కుల కోసం కనీసం 10 ఏండ్లు పనిచేసిన వారు కానీ, బాలల హక్కుల కోసం ఎన్జీవో నడిపిన వాళ్లు మాత్రమే ఈ పదవికి అర్హులని, సీతాదయాకర్‌కు రాజకీయ పునరావాసం కోసమే పదవి ఇవ్వజూస్తున్నారని న్యాయవాది జయాకర్‌రావు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

నల్లగొండలో వలస నేతలకే పదవులు

నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నుంచి లోక్‌సభ టికెట్ దక్కలేదని ఓ బీఆర్ఎస్ నేత, తన కొడుకుతో కలిసి కాంగ్రెస్‌లో చేరారని, ఆయన పార్టీలోకి వచ్చి రెండు నెలలు కాకముందే కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారని సూర్యాపేటకు చెందిన యువ కాంగ్రెస్ నాయకుడు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే ఏఐసీసీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పదవి ఇవ్వడంపైనా స్థానిక కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు.

ఈ దఫా అయినా పదవులు దక్కాలి

నిరుడు మార్చిలో ప్రభుత్వం నియమించిన 37 గ్రేడ్-1 క్యాటగిరీ కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో అత్యధికులు వలస కాంగ్రెస్ నేతలే అని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఆ జాబితాలో ప్రక్షాళన జరగాలని, పునర్నియామకాలు జరపాలని కోరుతూ ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎస్ శాంతికుమారికి ఫిర్యాదులు చేశామని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు నమస్తే తెలంగాణకు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో సుమారు 60 పదవులను భర్తీ చేసే అవకాశమున్నదని, ఆ పదవుల కోసం 200 నుంచి 250 మంది నేతలు ఆశలు పెట్టుకున్నారని చెప్తున్నారు. ఈ దఫాలోనైనా అసలైన కాంగ్రెస్ వాదులకు పదవులు దక్కాలని నేతలు ఏఐసీసీకి పెద్దలకు మొర పెట్టుకుంటున్నారు.

6.6 లక్షల మందికి ఆత్మీయ భరోసా

కుటుంబం యూనిట్‌గా అందజేస్తాం : మంత్రి సీతక్క

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అర్హులైన 6.6 లక్షల మందికి ఆత్మీయ భరోసా ద్వారా ఆర్థిక చేయూత అందిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టంచేశారు. ఆసరా పింఛన్ల మాదిరిగా కుటుంబం యూనిట్‌గా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆరు నెలలకు రూ.6 వేల చొప్పున ఏడాదికి రూ.12 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 48,13,966 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయని, వీరిలో ఒక్కరోజు కూడా ఉపాధి హామీ పనికి వెళ్లనివారు 25.50 లక్షల మంది ఉన్నట్టు చెప్పారు. వీరిలో 17.6 లక్షల కుటుంబాలు 20 రోజుల పనిదినాలు పూర్తిచేసుకున్నాయని, ఇందులోనూ 11 లక్షల మంది భూమి కలిగి ఉన్నారని, వీరుపోగా సుమారు 6.6 లక్షల మందికి ఆత్మీయ భరోసా అందిస్తామని వివరించారు.

దళిత తహసీల్దార్‌పై కాంగ్రెస్ నేతల దౌర్జన్యం

- **మాట వినకపోతే సస్పెండ్ చేయిస్తామని బెదిరింపులు**
- **ముఖంపై పేపర్లు విసిరి వెటకారం**

మహబూబ్‌నగర్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి), జనవరి 19 : ప్రభుత్వ అధికారులపై కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. చెప్పినట్టు వినకపోతే సస్పెండ్ చేయిస్తామని బెదరింపులకు దిగుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి ఎక్కువయింది.పెంట్లవెల్లి తహసీల్దార్‌పై అధికార పార్టీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో ఆమె నిరాకరించారు. మహిళ, దళిత తహసీల్దార్ అని కూడా చూడకుండా పేపర్లను ముఖంపై విసిరేసి, సస్పెండ్ చేయించిన తర్వాతే కార్యాలయంలోకి అడుగుపెడతామని కాంగ్రెస్ నాయకులు బెదిరించినట్టు తెలిసింది. శుక్రవారం కల్యాణలక్ష్మి కార్యక్రమంలో ప్రజాప్రతినిధికి తప్పుడు సమాచారం ఇచ్చి సస్పెండ్ చేయిస్తామని పబ్లిక్‌లో బెదరింపులకు దిగారు. కాంగ్రెస్ నాయకులు దళిత మహిళ తహసీల్దార్‌ను బెదిరించడంపై మాలమహానాడు రాష్ట్ర నాయకులు పీవీ రావు, గోవురాజు మండిపడ్డారు .అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వరంగల్ ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాకేశ్

ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయాలి

- **ఆరోగ్యశ్రీ నెట్‌వర్కింగ్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్**

వరంగల్ చౌరస్తా, జనవరి 19 : ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ప్రైవేట్ దవాఖానకు ప్రభుత్వం బకాయిఉన్న మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్కింగ్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ ఐఎంఏ హాల్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న 63 ప్రైవేట్ హాస్పిటల్స్ ఈ నెల 10 నుంచి రివ్యూ, డయాలసిస్ కేసులు మినహా అన్ని రకాల ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. ఏకపక్షంగా ఉన్న ఎంవోయూలను రద్దు చేసి సరళీకృత విధానాన్ని తీసుకురావాలని, జూలై 20 24లో సమకూర్చుకున్న అసంపూర్ణ ప్యాకేజీ వ్యవస్థ మార్పునకు నెట్‌వర్కింగ్ హాస్పిటల్స్ సమాచారాన్ని జోడించి నూతన ప్యాకేజీలు రూపొందించాలని, పాత బకాయిలు వెంటనే చేయాల్సిందిగా డిమాండ్ చేశారు.

ప్రమాదంలో పోలీసు ఆరోగ్య భద్రత

- **పోలీసు ఆరోగ్య భద్రత పథకంపై సర్కారు నిర్లక్ష్యం**
- **బకాయిల చెల్లింపులో ప్రభుత్వ పెద్దల అలసత్వం**
- **దవాఖానల్లో నిలిచిన వైద్యసేవలు, పట్టని ప్రభుత్వం**
- **వైద్యమో రామచంద్రా అని పోలీసు కుటుంబాల ఆవేదన**

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో దవాఖానలో చేరే పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసు ఆరోగ్య భద్రత పథకాన్ని ద్వారా ఆపన్నహస్తం అందించింది. ఎవరైనా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు దవాఖానలో చేరితే రూపాయి ఖర్చు లేకుండా చికిత్సకు సహకరించింది. పోలీసులపై భారం పడకుండా ప్రభుత్వమే బిల్లులు చెల్లించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం నిర్వీర్యమైందని పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా దవాఖానల్లో సేవలు నిలిచిపోయాయని మండిపడుతున్నారు.

ముందే చెప్పినా ఇంత నిర్లక్ష్యమా?

పోలీసు ఆరోగ్యభద్రత పథకంలో భాగంగా చికిత్స అందించినందుకు దవాఖానలకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. వీటిపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, బకాయిలు చెల్లించకపోతే ఉచిత వైద్య సేవలు నిలిపివేస్తామని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్ఏ) హెచ్చరించింది. పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం చర్చలకు పిలుస్తుందని అసోసియేషన్ సభ్యులు ఆశించారు. కానీ ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఎవరూ కనీసం స్పందించకపోవడంతో ఆదివారం నుంచే దవాఖానల్లో సేవలు నిలిచిపోయాయి. అడ్మిట్ అయిన వాళ్లకు కూడా సరైన సేవలు అందడం లేదని దవాఖానల్లో చికిత్స పొందుతున్న పోలీసుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రక్షకభటులంటే లెక్కలేదా?

పోలీసు ఆరోగ్య భద్రత పథకంలో దవాఖానల్లో రోజుకు 120 నుంచి 130 మంది అడ్మిట్ అవుతారు. వీటి ఖర్చు భరించడం ప్రభుత్వానికి పెద్ద భారమేమీ కాదని బాధిత పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలకు తెగించి, అహోరాత్రులు విధులు నిర్వర్తించే తమ పట్ల కనీస మానవత్వం, గౌరవం చూపకపోవడం దారుణమని మండిపడుతున్నారు. సేవలు నిలిపివేస్తామని దవాఖానలు హెచ్చరించినా ప్రభుత్వ పెద్దలు, హోంశాఖ అధికారులు హాస్పిటల్స్ అసోసియేషన్‌తో చర్చలు జరపకపోవడం తీవ్రంగా కలచివేస్తున్నదని వాపోతున్నారు. దవాఖానలకు బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతున్నామని హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి చెప్తున్నా ఆచరణలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆరోగ్యభద్రతను నిర్వీర్యం చేసే కుట్ర?

దవాఖానలకు బకాయిల చెల్లింపులో ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వెనుక పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర ఉందని కొందరు పోలీసు అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని దవాఖానలు పోలీసులకు ఉచిత వైద్యం నిలిపివేసినందున తమ కుటుంబాలకు సంబంధించిన వైద్య సమాచారం, ఇబ్బందులు, సౌకర్యాల విషయాలను ఉన్నతాధికారులకు తెలిపే ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని బాధిత పోలీసు కుటుంబాలు వేడుకుంటున్నాయి.

'సమగ్ర' సర్వే సిబ్బందికి 10 వేలు బాకీ

- **పారితోషికం ఇవ్వని సర్కారు**
- **అటెండెన్స్ సర్టిఫికెట్ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు**
- **ఆదేశాల్లేవు.. ఇవ్వలేమంటున్న అధికారులు**

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ): నిరుడు నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లకు సర్కారు మొండిచేయి చూపించింది. సర్వే పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకూ ఇస్తానన్న పారితోషికాన్ని ఇవ్వలేదు. ప్రతి ఇంటికీ కాళ్లరిగేలా తిరిగి సమగ్ర సమాచారాన్ని సేకరించినా ప్రభుత్వానికి కనికరం లేకపోయిందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. పైపెచ్చు హాజరు సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నది. రాష్ట్రంలో 1.17 కోట్ల కుటుంబాల వివరాల సేకరణకు దాదాపు 80 వేల మంది సిబ్బందిని వినియోగించారు. వీరిలో 36,549 మంది ఎస్జీటీలు, 3,414 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారికి ఆకర్షణీయమైన పారితోషికాన్ని ఇవ్వాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆనాడే కోరాయి. ఈ మేరకు రూ.10 వేల చొప్పున పారితోషికం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సర్వే పూర్తయిన వెంటనే పారితోషికాన్ని ఇవ్వాలని సంఘాల వినతిని, ప్రభుత్వ వర్గాలు సరేనని ఒప్పుకున్నాయి. అయినా ఇంతరకు రెమ్యునరేషన్ మొత్తాన్ని ఎన్యుమరేటర్లకు ఇవ్వనేలేదు. ఇటీవలే మంత్రులు, అధికారులను కలిసి రెమ్యునరేషన్ అందజేయాలని కోరినా ఫలితం లేకుండా పోయిందని కొందరు ఉద్యోగ సంఘాల నేతలు వాపోతున్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్ల కోసం

సర్వే సందర్భంగా సిబ్బంది సెలవు రోజుల్లోనూ విధులు నిర్వహించారు. ఐదు రోజులపాటు విధులు నిర్వహించారు. ఈ సెలవు రోజుల్లో అటెండెన్స్ సర్టిఫికెట్ ఇస్తే పరిహార సాధారణ సెలవులు (సీసీఎల్) పొందేందుకు అవకాశం ఉంటుంది. దీంతో అటెండెన్స్ సర్టిఫికెట్ కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయా ల చుట్టూ తిరుగుతున్నారు. తమకు పైనుంచి ఆదేశాలు లేవని, ఇవ్వలేమని ఎంపీడీవోలు, పంచాయితీ రాజ్‌శాఖ సిబ్బంది కరాఖండిగా చెప్పేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో హాజరు ధ్రువీకరణ పత్రాలు ఇస్తుండగా, మరికొన్ని చోట్ల ఇవ్వడమే లేదు.

హాజరు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

కులగణన సర్వే నిర్వహించిన సిబ్బందికి హాజరు ధ్రువీకరణపత్రం ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే అధికారులకు ఆదేశాలివ్వాలి. హాజరు ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోతే సిబ్బంది 5 రోజులు నష్టపోయే అవకాశం ఉన్నది.

– మ్యాన పవన్‌కుమార్, టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పీఆర్సీ నివేదికను అమలు చేయాలి: టీపీటీఎఫ్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : నూతన పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలుచేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఉద్యోగ విరమణ వయసును పెంచే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. విద్యారంగంలో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలని నేతలు కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, తిరుపతి, ప్రకాశ్‌రావు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి: యూటీఎఫ్

హైదరాబాద్, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : టీచర్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పీఆ ర్సీ నివేదికను తెప్పించి ఫిట్‌మెంట్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాలుగు పెండింగ్ డీఏలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, వెంకట్, జంగయ్య, లక్ష్మారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

'కారుణ్యం'పై కాఠిన్యం!

మొదటిపేజీ తరువాయి...

హోంగార్డుల కుటుంబాలను రోడ్డున పడేసే కుట్ర చేసింది. కారుణ్య నియామకాల కింద ఇక నుంచి హోంగార్డులకు ఉద్యోగాలు ఇచ్చేది లేదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ మేరకు గత డిసెంబర్ 30న సర్క్యులర్ జారీ చేసింది. అది బయటికి రాకుండా ఇన్నాళ్లూ ఎన్నో తంటాలు పడింది. అయితే, తాజాగా ఆ ఉత్తర్వులు బయటకురావడంతో ఇటు హోంగార్డులు, అటు వివిధ కారణాలతో చనిపోయిన హోంగార్డుల కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. ఇన్నేండ్లుగా కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న తమ నోట్లో.. ఏరి కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మట్టి కొట్టిందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

కారుణ్య నియామకం వర్తించదు

కారుణ్య నియామకాలను భర్తీ చేసేది లేదంటూ గత డిసెంబర్ 30న రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి. 'తెలంగాణ రాష్ట్రంలో మరణించిన హోంగార్డుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలన్న హోంగార్డ్స్ సంస్థ ప్రతిపాదనను హోంశాఖ తిరస్కరించింది. తాత్కాలిక సేవలను పొందేందుకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. మరణించిన తాత్కాలిక ఉద్యోగిపై ఆధారపడిన వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని ఎలాంటి నిబంధనలు లేవని తెలంగాణ డీజీపీ దృష్టికి తీసుకొస్తున్నాను. హోంగార్డులు స్వచ్ఛంద సేవలు మాత్రమే అందిస్తున్నందున వారికి కారుణ్య నియామకాలు అందించడం సాధ్యం కాదు' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు వెలువడిన దగ్గర్నుంచి తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక హోంగార్డులు బోరున విలపిస్తున్నారు.

పర్మినెంట్ చేస్తామని నాడు హామీ

హోంగార్డులకు బీఆర్ఎస్ ప్రభుత్వం భిక్ష మేస్తున్నదని, తాము అధికారంలోకి వస్తే వారిని పర్మినెంట్ చేస్తామని, 2016 నుంచి మరణించిన 800 మంది హోంగార్డుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి హామీలు ఇచ్చారు. ఎన్నికల వేళ హోంగార్డులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రి సీతక్కకు గత జూలైలో హోంగార్డులు వినతిపత్రం ఇచ్చారు. ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలు దఫాలుగా తమ గోడు వెళ్లబోసుకున్నారు. కానీ, ఎలాంటి ఫలితం దక్కలేదు. దీంతో హోంగార్డులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా కారుణ్య నియామకాలు కొనసాగుతున్నా.. తెలంగాణలో అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్‌ను కాదనుకొని..

హోంగార్డుల సంక్షేమాన్ని పట్టించుకున్న కేసీఆర్‌ను కాదనుకొని.. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు తమకు తగిన బుద్ధి చెప్పారని కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న హోంగార్డుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీఏ తెచ్చిన కేసీఆర్‌ను వదులుకొని, నాడు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేయించామని, దాని ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నామని అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎనిమిదన్నరేండ్లలో రూ.17 వేలు పెంచి ఆదుకుంటే.. రేవంత్‌రెడ్డి తమ బతుకుల్లో మట్టికొట్టారని వేలాది మంది హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డులకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, 'గవర్నమెంట్ డ్యూటీ' అని చెప్పి రేషన్‌కార్డుల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు కారుణ్య నియామకాలు వస్తాయని ఎదురుచూసి భంగపడ్డామని అంటున్నారు. తమను పర్మినెంట్ చేసేందుకు ఎస్పీఏ తీసుకొచ్చి.. విడుదల చేసిన జీవోను సాకుగా చూపి కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడం దారుణమని మండిపడుతున్నారు. తమ న్యాయమైన హక్కును సాధించుకునేందుకు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలుపుతామని హోంగార్డులు స్పష్టం చేస్తున్నారు.